# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





– 12 –

# దాగుడు మూతల యుద్ధం కథ

నిన్న గాక మొన్న నాకూ మా క్వీన్ విక్టోరియాకీ మధ్య రామ రావణ యుద్ధం అయిపోయింది. అంటే ముందు యుద్ధం అయింది...కాస్సేపటి తర్వాత కంటిన్యూ అవకుండా ఆగి పోయింది అనమాట. ఇది ఎప్పుడూ జరిగే తంతే. ఇక్కడ నాకు అర్థం అవని విషయం ఏమిటంటే..నిజానికి భార్యా భర్తల మధ్య చిన్నా పెద్దా యుద్ధాలు జరగడం పెద్ద గొప్పేం కాదు కదా. కానీ వాటిని ఏదో రాముడూ, సీతా యుద్ధం అనో, కృష్ణుడూ, సత్యభామా యుద్ధం అనో ఉపమానాలు వాడుకోవాలంటే అలాంటివి మన పురాణాలలో లేవు. ఉన్నా అవి ఏక పక్షమే. అంటే ఉదాహరణకి సత్యభామ కోపగించి అలిగి, ముడుచుని పడుకోగానే కృష్ణుడు తిరిగి కోప్పడ లేదు సరి కదా, కాళ్ళ బేరానికి వచ్చి పద్యం పాడాడు కదా. అది యుద్ధం ఎలా అవుతుందీ? అంచేత నేను ఎంత బుర్ర గోక్కున్నా మా వంటింటి యుద్ధానికి సరి అయిన ఉపమానం పురాణాల్లో దొరక్క పోవడం కాస్త అవమానం గానే ఉంది. వేల సంవత్సరాలలో భర్తతో సరదాకి అయినా యుద్ధం చెయ్యని భార్య పాత్రని కనీసం ఒకటైనా మన కవులు  సృష్టించ లేదూ అంటే వాళ్లందరూ అటువంటి అవకాశం ఇవ్వని భార్యా విదేయులు అనే అనుకోవాలి మరి. అలాగే అలిగి పుట్టింటికి వెళ్ళిపోయిన భార్యామణులు కూడా పురాణాల్లో లేరు. అంతా కలికాల మహిమ.

అసలు మా వంటింట్లో యుద్ధానికి కారణం ప్లాస్టిక్ డబ్బాలు మరియు వాటి మూతలు. ఆ విషయానికి తరువాత వస్తాను కానీ అసలు జరిగింది ఏమిటంటే ఆ రోజు అమెరికాలో అందరి ఇళ్ళలో లాగే మా ఇంట్లో కూడా ఆదివారం సూర్యుడు ఉదయించాడు. అంటే అక్కడెక్కడో జపాన్లో ఉదయించినా మా వాటా కిరణాలు కిటికీ లోంచి మాకు వెదజల్లాడు. ఎప్పటి లాగానే మా క్వీన్ విక్టోరియా నడుం బిగించి యుద్ధానికి సన్నిద్ధం అయింది. ఇది అసలు యుద్ధం కాదు. ఇది స్వయుద్ధం..అంటే సెల్ఫ్ పోరాటం అనమాట. కేవలం తనలో తనే ఇవాళ ఏం వంట చెయ్యాలా అనే దానికి పడే తర్జన భర్జన మాత్రమే. మిగతా వాళ్ళ ఇళ్ళలో ఏం చేస్తారో నాకు తెలీదు, పైగా అది నాకెందుకు కానీ...మా ఇంట్లో మటుకు వారానికి సరి పడా వంటలో 80 శాతం ఆదివారం మోర్నింగ్ షిఫ్ట్ లో జరుగుతుంది. ఆ మాటకొస్తే మా ఇంట్లో ఆదివారం ఉదయం 8 నుంచి 12 దాకా మాత్రమే వంట షిఫ్టు. ఆ సమయంలో అటు పొయ్యి మీద నూనె కుయ్, కుయ్, పోపు సామాగ్రి సుయ్, సుయ్, ఇటు సెల్ ఫోన్ లో గయ్, గయ్ లు కూడా నిరాటంకంగా సాగుతూ ఉంటాయి. ఫోన్ ఆగిపోగానే గంట కొట్టేసినట్టు మా ఇంటి వంట అయిపోయినట్టు అన మాట.

అంతే కాదు. నేను ప్రగాఢమైన తెలివితేటలతో గమనించిన మరొక విషయం ఏమిటంటే ఆ రోజే కాదు, ఏ రోజైనా సరే మా క్వీన్ విక్టోరియా ఏం వంట చేసిందీ అని తెలుసుకోడానికి అన్ని గిన్నెలూ మూతలు తీసి వాసన  చూడక్కర లేదు.  కాస్సేపు తల ఎత్తకుండా వంటింటి నేల మీద చూస్తే చాలు. ఉదాహరణకి నేలమీద ఎక్కడో ఒక మూల ఒక చిన్న వంకాయ ముక్క మన కేసి జాలిగా చూస్తోంది అనుకోండి. ఆ రోజు వంకాయ కూర అని తెలిసి పోతుంది. అంతే కాదు. మరో మూల ఓ అల్లం ముక్క కూడా కనపడింది అనుకోండి. ఇక అనుమానమే లేదు. ఖచ్చితంగా వంకాయ అల్లం పచ్చి మిరపకాయ కూరే. ఎప్పుడైనా పొరపాటున ఏమీ కనపడక నేల అంతా శుభ్రంగా ఉంటే...ఆ రోజు మనకి పస్తే.... ఆ ఫోన్ మహత్యమో ఏమిటో అదేమిటో

తెలీదు కానీ మా క్వీన్ విక్టోరియా కిచెన్ కౌంటర్ మీద ఏది తరిగినా శాంపుల్ ముక్కలు నేల మీద పడాల్సిందే...నేనూ, మా కుక్కా వాటిని తొక్కి తరించాల్సిందే. ఒక రోజు చిన్న మామిడి కాయ తొక్క కనపడగానే మామిడి కాయ పప్పు లో తినడానికి అర్జంటుగా ఎందు మిరపకాయలు వేయించేశాను..అండ్ ఐ వజ్ రైట్!

ఇక 80 శాతం వంట అంటే దానికి కారణం మా పెళ్లి నాటి ప్రమాణాలు. 100 % పెళ్లి అయిపోయాక ఆ మత్తులో ఎటువంటి వాగ్దానాలు చేస్తామో తెలియని దౌర్భాగ్య క్షణాలలో 'నీకు వంట చేయుట వచ్చునా, లేక తినుట మాత్రమే వచ్చునా? అని ఆమె అడుగుటా, నేను 'ప్రియతమా, నీ ఆజ్ఞ అయినచో ముందు వంట చేయుదును, తరువాతనే తినుదును, మహారాణీ' అని వెర్రి వెధవ లాగా వాగి ప్రమాణము చేయుటా అప్పుడెప్పుడో సత్యభామ కృష్ణుడు సున్నితంగా తాకిన నాటి ద్వాపర యుగం లో జరిగింది. అది ఇప్పుడు రోజు వారీ 20 శాతం నా డ్యూటీ గా మారిపోయింది. అనగా...ఆదివారం పొద్దున్న షిఫ్ట్ లో ఆవిడ కాస్త కాంప్లికేటెడ్ వంటలు..."అంటే పోపు వేయుము" అని అసలు ఆ పోపు లో ఏం వెయ్యాలో చెప్పీ చావకుండా తప్పించుకునే వంటల పుస్తకాల బాపతు కూరలు, పచ్చళ్ళు, పులుసులూ ఆవిడ చేయుటా, ప్రతీ రోజూ అప్పటికప్పుడు వేడిగా తినడానికి బావుంటాయి కాబట్టి 20 శాతం..అంటే ఒక వేపుడు కూర చేసే డ్యూటీ నాదీ అనమాట. వారం లో మిగిలిన రాత్రీ, పగలూ షిఫ్ట్ లు అన్నీ ఆవిడ పని చేసే ఆసుపత్రికే అంకితం. ఆవిడ వర్కహాలిక్..నేనేమో...ఒద్దు లెండి..

పైగా మా అమెరికా రూల్సు ప్రకారం వారానికి సరిపడా మోర్నింగ్ షిఫ్ట్ లో 80 శాతం వంట ప్లాస్టిక్ డబ్బాలలో పెట్టి మామూలు రిఫ్రిజిరేటర్ లో పెట్టుకుని రోజూ తినేటప్పుడు బయటకి తీసి, మైక్రోవేవ్ లోనో కుంపటి మీదో వేడి చేసుకుని, ప్లేటు లో పెట్టుకుని, టీవీ ముందు కూచుని భోరుమని విచారంగా మొహం పెట్టి ...అంటే ఆ తెలుగు సీరియల్ చూస్తూ అనమాట మా క్వీన్ వికోరియాకి భోజనం చెయ్యడం అలవాటు. కొందరి ఇళ్ళలో అయితే పెద్ద గొప్పగా డైనింగ్ టేబుల్ మీద రోజూ వెండి కంచాలలో తింటాం అని చెప్పుకోడం విన్నాను. ఎవరు చూసొచ్చారు కనక. నేను మెరిసిపోయే ఆ వెండి కంచాలు వాళ్ళ ఇళ్ళల్లో గాజు బీరువాలలో షోగ్గా పెట్టుకోవడమే చూశాను మరి. రోజూ వాడుతూ ఉంటే అవి కూడా వాడిపోయే ఉండాలిగా. అంత సీను లేదు. అంతా పై పై బడాయి. అన్నట్టు మేము కావాలంటే కొనుక్కుని కొరుక్కు తింటాం కానీ ఈ నాటి యువతరం చైనీసు జిగట వంటలు, గోబీ మంచూరియాలూ, బిరియానీలు, బర్గర్లు, పిజ్జాలు, పాస్తాలు, నూడులుసు వగైరాలు మా ఇంటా, వంటింటా లేవు. మాది తరవాణీ, అందులో దబ్బ కాయ లేదా కొత్తావకాయ తరం. అబ్బ...నోరు ఊరి పోతోంది కదా!



ఇంతకీ మొన్న ఆదివారం ఏమయిందంటే..వాతావరణం కాస్త చల్లబడింది. అంటే తోటలో ఉన్నకొన్ని మొక్కలు చలికి కాస్త ముడుచుకు పోవడం మొదలు పెడతాయి. చలి మరీ ఎక్కువ అవగానే రాత్రికి రాత్రే చచ్చి ఊరుకుంటాయి. ఆ కోవలోకి చెందినదే మనకి శాకంబరీ దేవీ ప్రసాదం అయిన గోంగూర. ఆ దేవికి నా మీద అమితమైన ప్రేమ. లేక పోతే నేను అప్పుడప్పుడు వెళ్లి కాస్సేపు ఆకులు నిమిరి చూపించిన వాత్సల్యానికే ఒకటా, రెండా ..ఏకంగా పది అడుగులు మా కారు గరాజ్ అంత ఎత్తుకి పెరిగి గోంగూర మొక్క అనే బదులు గోంగూర వృక్షము అని పిలిపించుకునే స్థాయికి ఎదిగింది. కావాలంటే రోడ్డు మీద నుంచి తీసిన ఫోటో ఇక్కడ జత పరిచాను చూడండి. మొన్న చూస్తే పాపం ఇప్పుడిప్పుడే కొంచెం వయసు కూడా వచ్చినట్టుంది. ఎందుకంటే కాస్త పువ్వులు కాయడం మొదలెట్టింది. పైగా ఇప్పుడు ఎలాగా చలికాలం వచ్చింది కదా, అది పూర్తిగా వాడి పోక ముందే ఆ చెట్టుకి మోక్షం కలిగించి గోంగూర పచ్చడి చేసుకుందాం అని మా ఫెర్నాండేజ్ చేత కొట్టించి లోపలకి పట్టుకొచ్చాను. అది చూసి "అయ్య బాబోయ్. అంత గోంగూరే...ఎవడు చేస్తాడు, నాకు టైము లేదు" అని గయ్యి మంది అప్పటికే సగం షిఫ్ట్ దాటి పని చేసిన మా క్వీన్ విక్టోరియా. ఆకులు తీయడం ఎలాగా నా పనే కానీ పాపం మా అమ్మాయి జాలి పడి కొంతా, గోంగూర పచ్చడి అంటే ఇష్టం కాబట్టి మరికొంతా నాకు సాయం చేసింది. మా ఆనందాన్ని ఇక్కడ పెట్టిన ఫోటోలలో చూడ వచ్చును. నమ్మండి, నమ్మక పొండి. పదడుగుల

మొక్క నుంచి ఎనిమిది ప్లాస్టిక్ గంపల ఆకులు దుయ్యడానికి నాలుగున్నర గంటలు పట్టింది. తీరా అంత గోంగూరనీ చూశాక, ముఖ్యంగా మేము ఆకులు అన్నీ కోసేశాక ఇక ఎక్కువ చాకిరీ లేదు కాబట్టి మా క్వీన్ విక్టోరియా ఆవేశ పడిపోయి రెండో షిఫ్ట్ లోకి దిగిపోయి, ఆయాస పడిపోయి ఏడాదికి సరిపడా గోంగూర పచ్చడి అధ్భుతంగా చేసింది. అద్భుతం అని నాకు ఎలా తెలిసిందీ అంటే...ఆవిడ చూడకుండా ఓ చెంచాడు నోట్లో వేసుకుని రుచి చూసేశాను కదా!

ఇక ఇవాల్టి లాగా నిలవ పచ్చళ్ళు, ఆవకాయలు చేసుకున్నప్పుడు రోజూ తినడానికి పది రోజులకి సరి పడా ఒక చిన్న జాడీ లోకో ప్లాస్టిక్ డబ్బాలోకో తీసుకుని పక్కన పెట్టుకోవడం, మిగిలినది అంతా ఎంత త్వరగా బూజు పడతాయో అనేదాన్ని బట్టి పెద్ద ప్లాస్టిక్ డబ్బాలోనో, నాలుగైదు చిన్న వాటిల్లోనో కుక్కేసి మామూలు రెఫ్రిజిరేటర్ లో కానీ, ఫ్రీజర్ లో కానీ పెట్టుకోవడం అమెరికాలో పెట్టుకోవడం మా వంశాచారం. అదే ఇండియాలో ఉన్నప్పుడు ఆవకాయలు, పచ్చళ్ళు మాత్రమే జాడీలకి గుడ్డ చుట్టి అటక మీద పెట్టుకోవడం మా అమ్మ ఆచారం. అమెరికాలో ఈ ప్లాస్టిక్ డబ్బాలలో కుక్కుడు డ్యూటీ ఎల్లవేళలా నాదే.



అదిగో అక్కడే వచ్చింది మా ఇద్దరికీ యుద్ధం. ఇదేం మొదటి సారి కాదు. మొదటి పానిపట్టు యుద్ధము, రెండవ పానిపట్టు యుద్ధము లాగా ఇది ధారావాహిక పోరాటం. దాగుడు మూతల యుద్ధం. విషయం ఏమిటంటే మా ఇంట్లో మేము కొనుక్కున్నవీ, ఎవరింటికైనా వెళ్ళినప్పుడు వాళ్ళు తినగా మిగిలి పోయిన కూరలు, పులుసులు మాకు పెట్టి ఇచ్చినవీ...వాటిని డాగీ బేగ్ అంటారు ఎందుకో ..(మిగిలి పోయిన వంటకాలు కుక్కలకి పెడతారు కాబోలు మరి)...పెళ్ళిళ్ళలో, పేరంటాలలో వచ్చినవీ ..ఇలాంటివన్నీ కలిసి కనీసం వంద ప్లాస్టిక్ డబ్బాలు ఉంటాయి. ఇక్కడ రాజు గారి పోలిసీ ..అంటే నాది..ఏమిటంటే ఏ డబ్బా కి ఆ మూత సరిగ్గా పెట్టి వంటింటి కౌంటర్ క్రింద సొరుగుల్లోనో, అలమారా ల్లోనో దాచాలి. రాణీ గారి సిద్ధాంతానికి ప్రాతి పదిక ఏమిటంటే "నీ మొహం. నీకేం తెలీదు. అలా చేస్తే చోటు చాలక నువ్వు ఇంకో ఇల్లు కొనుక్కోవాలి...అంచేత డబ్బాలన్నీ ఒక దాంట్లో ఒకటీ, మూతలన్నీ ఒక దాని మీద ఒకటీ పెడితే ఎక్కువ చోటు అక్కర లేదు" అనేది ఆవిడ సిద్ధాంతం. ఇప్పుడూ, ఎప్పుడూ నాకు వచ్చే సమస్య ఏమిటంటే ఆ వంద డబ్బాలలోంచీ గోంగూర కోసం నాలుగు ఖాళీ డబ్బాలు తీసి వాటికి సరి అయిన మూతలు వెతకడం.

ఇహనేం. వెంటనే రంగంలోకి దిగాను. ఒక్కొక్క డబ్బా తియ్యడం, ఒక్కో మూత పెట్టి చూసి అది పట్టక పక్కన పారెయ్యడం. ఇలా పది డబ్బాల వైఫల్యం తరవాత ఇలా లాభం లేదు అని మొత్తం వంద డబ్బాలు వాటి వాటి ఆకారాలని బట్టి భోజనాల బల్ల మీద వరసగా అమిర్చాను. అలాగే వంద మూతలూ సొగసుగా పెట్టాను. అంటే గుండ్రంగా ఉన్న డబ్బాలు, మూతలు ఒక చోట, చతురశ్రాకారానివి ఒక చోట, డిష్ వాషర్ లో పది సార్లు పడ్డాక ఆకారాలు మారి పోయి అష్ట వంకరలూ తిరిగిపోయినవి ఒక చోట పేర్చాను. ఈ తతంగానికి రెండు గంటలు పట్టింది. ఇప్పుడు మళ్ళీ ఒక్కొక్క డబ్బా తీయుట, మూత పెట్టుట, అది పట్టక పోవుట, నాకు చెమట పట్టుట ఆట ఆడుకుంటున్నాను. అంటే ఎప్పుడైనా కిండర్ గార్టెన్ స్కూల్ కి వెళ్ళినపుడు అక్కడ బల్ల మీద గుండ్రం, చదరపు వీ, దీర్ఘ చతురశ్రాకారానివీ రంగు రంగుల ప్లాస్టిక్ వి..వాటిని లెగో లు అంటారు...ఉంటాయి. చంటి పిల్లలకి సంయమనం కుదరడానికి వాళ్ళు గుండ్రంగా ఉన్న దాన్ని గుండ్రం కన్నం లోనూ, స్క్వేర్ గా ఉన్నది స్క్వేర్ కన్నం లోనూ పెట్టాలి. అలాంటి పరిస్థితిలోనే నేను తలమునకలుగా ఉండగా మా క్వీన్ విక్టోరియా వంట తరువాత చేసే స్నానపానాదులు ముగించి నన్ను చూసి "అదేమిటి మొగుడూ, వాటీజ్ ఆల్ దిస్. ఆ డబ్బాలూ, మూతలూ.. ఏమన్నా దాగుడు మూతలాడుతున్నవా? " అంది ఆశ్చర్యంగా. అప్పుడు గోంగూర పెట్టడానికి డబ్బాల కోసం నేను పడుతున్న అవస్థ చెప్పి అసలు డబ్బాలనీ, మూతలనీ విడదీయడం ఆలూమగలని విడదీసినంత నేరం



అని తీవ్రంగా ప్రకటించి యుద్ధం ప్రకటించాను. మా ఆవిడ ఎదురు యుద్ధం చేస్తుంది కదా అని నేను ఇతర అస్త్రాలు రెడీ చేసుకుంటూ ఉంటే ఆవిడ విలాసంగా నవ్వేసి “ఓ, దటీజ్ సింపుల్” అనేసి పక్క సొరుగులోంచి నాలుగు పెద్ద జిప్ లాక్ సంచీలు తీసి. వాటిల్లో ఆ గోంగూర పచ్చడి కుక్కేసి, ఫ్రీజర్ లో పడేసి “ఆ డబ్బాలన్నీ ఒక దాంట్లో ఒకటి మళ్ళీ పెట్టు, అలాగే మూతలు ఒకదాని మీద ఒకటి పేర్చి అల్మారాలో పెట్టు” అని పోటీ చెయ్యకుండానే విజయం ప్రకటించింది. ఈ దాగుడు మూతల ధారావాహిక యుద్ధం లో “చస్తే అలా చెయ్యను. ఏ డబ్బా మూత ఆ డబ్బా కి పెట్టిన తర్వాతే ..హ...” అని నేను హుంకరించాలా, లేక ఎప్పటి లాగానే ఓటమి అంగీకరించాలో తెలియక ఆ శాకంబరీ దేవి ఉపాసన మొదలు పెట్టాను.

**COMMENTS**